క్లుప్తంగా

సత్తెమ్మ తల్లికి మురళీకృష్ణంరాజు పూజలు



సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న కృష్ణంరాజు

జగ్గంపేట: మండలంలోని రామవరం వద్ద జాతీయరహదారి 16ను ఆనుకుని వెలసియున్న సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయుకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు శనివారం పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని రూ.5వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు,గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

సత్యదేవునిని దర్శించిన జిల్లా జడ్జి



సత్యదేవుని సన్నిధిలో జడ్జి గంధం సునీత, కుటుంబ సభ్యులు

అన్నవరం: రాజమహేంద్రవరం జిల్లా జడ్జి గంధం సునీత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు ఆలయం పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలను అందించారు.

భక్తిశ్రద్ధలతో అన్నదానం



కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: విజయదశమి ముగింపు వేడుకలను పురస్కరించుకిని మండల కేంద్రం శంఖవరంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పర్వత రాజబాబు, స్థానిక భక్తులు భారీ ఎత్తున పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శబరిమలకు పాదయాత్రగా పయనం



ధర్మవరం నుంచి పాదయాత్ర చేపట్టిన స్వాములు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం నుంచి ఏడుగురు అయ్యప్పస్వామి భక్తులు శనివారం పాదయాత్రగా శబరిమల సన్నిధానానికి పయనమయ్యారు. గ్రామానికి చెందిన పోకనాటి రాఘవేంద్ర, సతీష్, రాజశేఖర్, నానాజీ, అర్జున్, పెద్దిపాలెంకు చెందిన కొండలరావు, సింహాద్రిపురం చెందిన ఈశ్వరుడు ఈ పాదయాత్ర చేపట్టారు. అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మండల దీక్ష పూర్తి చేసిన స్వాములకు ఇరుముడి కట్టారు. ధర్మవరం నుంచి శబరిమలకు 1,200 కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర సాగనుందని స్వాములు తెలిపారు.

తాగునీటి కోసం అవస్థలు



పైప్‌లైన్ నుంచి లీకవుతున్న తాగునీరు (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి గ్రామంలో రక్షిత మంచి నీటి పథకం పైపులైను పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో తరచూ ఈ పైప్‌లైన్ మరమ్మతులకు గురై తాగునీరు వృథావుతుంది. ఫలితంగా గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. భూగర్భంలో పైప్‌లైను ఉండటంతో అధికారులకు సమస్య ఎక్కడ తలెత్తిందో కూడా గుర్తించడం సాధ్యం కావడంలేదు. ఇప్పటికైనా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఇందుగపల్లిలో వరి చేనుకు మందు పిచికారీ చేస్తున్న రైతు



జగన్నాథపురంలో కలుపు తీస్తున్న కూలీలు

కలవరిపాట్లు

- సాగులో రైతులకు తప్పని ఆటుపోట్లు
- సమాంతరంగా ఎదుగుతున్న కలుపు
- ప్రతికూల వాతావరణంతో తీవ్ర ప్రభావం

కోటనందూరు: ప్రతికూల వాతావరణంలో మెట్ట ప్రాంత ప్రధాన పంట వరిపై తెగుళ్ల ముప్పేట దాడి చేస్తున్నాయి. వేసవిని తలపించి కాస్తున్న ఎండలు, ముంపు భారిన పడే విధంగా కురుస్తున్న వర్షాలతో తెగుళ్ల ఒకదానితరువాత మరొకటి పంటపై అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఖరీఫ్ ఆరంభం నుంచి లోటు వర్షపాతమున్న మెట్టప్రాంతంలో గత నెల రోజులుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో వరిపంటతో సమాంతరంగా గడ్డి(కలుపు) ఎదుగుతుంది. తెగుళ్ల, కలుపు నివారణకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. పురుగుమందులు పిచికారీ చేస్తు ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నాడు.

ఇదీ పరిస్థితి..

తుని సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. తొలకరి ఆలస్యంగా పలకరించడంతో తుని, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో ఆలస్యంగా నాట్లు వేశారు. ఖరీఫ్ ఆరంభం నుంచి ప్రతికూల వాతావరణంలో నెల కొనడంతో తెగుళ్ల బెడద వెంటాడుతూనే ఉంది. వాతావరణ అసమానతలతో పైరు కూడా వేపుగా ఎదగలేదు. ఇకమీదటైనా వాతావరణం అనుకూలించకపోతే వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన నష్టాలు చవిచూసే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల దాడి..

ఆలస్యంగా నాట్లు వేయడం, వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం వరిపంటను నల్లి, హిస్పా, ఉల్లికోడు తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు విస్తృతంగా మందులు పిచికారి చేస్తున్నారు. ప్రస్తుత ఉక్కబోత వాతావరణంతో పంటతో సమాంతరంగా కలుపు ఎదిగిపోతుంది. నాట్లు వేసిన 24 రోజుల వరకూ రైతులు మందులతో కలుపును నివారించినప్పటికీ ఆ తురువాత కూలీలతోనే కలుపును తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి రైతులకు కలుపుతీత అదనపు భారంగా మారింది.

పెరిగిన ఎరువుల ధరలు..

కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేయడం రైతులకు గుదిబండగా మారింది. యూరియా ధర అదుపులో ఉన్నప్పటికీ కొరత ఏర్పడడంతో అవసరం మేర కాకుండా అందుబాటులో ఉన్నంత వరకూ యూరియా వేశామని రైతులు చెబుతున్నారు. పెరిగిన ధరలతో పెట్టుబడి పెట్టలేక ఎంత దిగుబడి వస్తే అంతే చాలు అన్నట్లుగా పెద్దగా ఎరువులు, పురుగుమందులు వినియోగించడం లేదని చెబుతున్నారు.

భారీగా తెగుళ్లు ఆశిస్తున్నాయి



అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల వరి పొలాలను తెగుళ్లు భారీగా ఆశిస్తున్నాయి. కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో మందులు కొనుగోలు చేసి పిచికారి చేయడం భారంగా మారింది. ప్రతికూల పరిస్థితుల్లో దిగుబడులు కూడా భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

తగిన మోదులోనే మందులు వాడాలి



తెగుళ్ల నివారణకు తగిన మోతాదులో మాత్రమే మందులు వినియోగించాలి. నల్లి నివారణకు డైకోఫాల్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. హిస్పా నివారణకు మోనోక్రోటోపాస్, క్వినాల్‌పాస్, క్లోరీఫైరిపాస్ మందులను తగిన మోతాదులో పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించొచ్చు. పురుగుమందులు, ఎరువుల యాజమాన్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కే.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

చట్టానికి లోబడే నిర్మాణాలు చేపట్టాలి



ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న అధికారి రామచంద్రరావు

తుని రూరల్: కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. శనివారం వచ్చిన ఆయనకు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆయన లోవ దేవస్థానంలో రూ.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అటవీశాఖ చట్టాలకు లోబడి నిర్మాణాలు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయ పునఃర్నిర్మాణ పనులతో పాటు ఎస్కూలేటర్ల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన ఆలయం మేరుపర్వతం ప్రకృతి సోయగాల నడుమ ఉండడం, భక్తుల రద్దీకి అనువుగా నిర్మాణాలు చేస్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండ చర్యలు చేపట్టాలన్నారు. అమ్మవారిని దర్శించుకున్న రామచంద్రరావుకు శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను ఈఓ బహుకరించారు.

చదువులమ్మ చెట్టు నీడలో



1999-2000 గురుకుల పాఠశాల పదో తరగతి బ్యాచ్

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదివ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అంతా 25ఏళ్ల తరువాత ఒక చోటకు చేరి గత అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి ఉపాధ్యాయులను వారంతా పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం తమ తమ జీవితంలో స్థిరపడిన విధానాలను, పరిస్థితులను ఈ సందర్భంగా వివరించారు. చదువులమ్మ చెట్టునీడలో చెట్టాపట్టాలేసుకుని కలసి తిరిగిన అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాల ఆవరణలో గ్రూపు ఫొటో దిగి తమ పూర్వ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసుకున్న సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అలనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ గంగాస్వామి విగ్రహావిష్కరణ



గంగాస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన 42వ బెటాలియిన్ కమాండెంట్

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన మేడిబోయిన నూకరాజు, అనంతలక్ష్మిల కుమారుడు గంగాస్వామి సీఆర్పీఎఫ్ 219 బెటాలియన్‌లో పనిచేసి 2016 జనవరి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, మిత్ర బృందం సహకారంతో ఉప్పలపాడు పంచాయతీ స్థలంలో గంగా స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్ శనివారం విగ్రహన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు గంగాస్వామి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్, రిటైర్డు రైల్వే ఉద్యోగి, డిప్యూటీ కమాండెంట్ దీపక్ కుమార్, డాక్టర నితిన్ ఝూల్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకన్న, 224వ బెటాలియన్‌కు చెందిన శివగణేష్, జిల్లా మాజీ పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి ప్రభాకర్, బొమ్మన రాజేశ్వరరావు, సీఆర్పీఎఫ్ బృందం, బీజేపీ గండేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు తోరాటి వెంకన్న, రిటైర్డు ఎస్సై తమటం నాగేశ్వరరావు, గ్రామానికి చెందిన ప్రముఖులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

సీడ్‌బాల్స్‌తో పర్యావరణ పరిరక్షణ



సత్యగిరి పైనుంచి సీడ్‌బాల్స్ విసురుతున్న విద్యార్థులు

అన్నవరం: వివిధ పళ్ల విత్తనాలతో తయారు చేసిన (సీడ్ బాల్స్) బంతులను మైదానాలు, కొండలపై నుంచి విసరడంతో సులభంగా మొక్కలను. అడవులను పెంచవచ్చని అటవీశాఖ విశ్రాంత అధికారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు టీ మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానంలోని సత్యగిరి పై ఆగమ పాఠశాల వెనుక సుమారు 30 వేల సీడ్ బాల్స్‌ను కాకినాడకు చెందిన సెయింట్ జోసఫ్ కాన్వెంట్ విద్యార్థిని విద్యార్థులతో విసిరించారు. ఈ సీడ్ బాల్స్‌లో నేరేడు, వేప, జామ, ఇతర పళ్ల విత్తనాలతో తయారు చేసినట్లు వెల్లడించారు. దీని వలన వచ్చే ఏడాది ఆ ప్రాంతంలో ఈ పళ్ల మొక్కలు పెరుగుతాయని తెలిపారు. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి ఎస్.రామచంద్రరావు, ఇతర అధికారులు సత్య పద్మజ, దుర్గారాం ప్రసాద్, జీ.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిని పిలవలేదు



ఎంపీపీ అత్తులూరి నాగబాబు లేకుండానే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఏకంగా మండల అధ్యక్షుడినే పిలవకపోడం అధికారుల నిర్లక్ష్యనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఎంపీపీ అత్తులూరి నాగబాబు ఏక్కడనున్నారని అని ఎమ్మెల్యే అడిగితే కాని ఆయనకు సమాచారం అందించలేదనే సంగతి అధికారులకు గుర్తుకు రాలేదు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ట్యాక్స్ అధికారులు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానకి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమం ప్రారంభమైన తరువాత ఎంపీపీ అత్తులూరి నాగబాబు కనపించక పోవడంతో ఎంపీపీ ఎక్కడ అని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు నాలుక కరుచుకుని అయ్యో ఆయనను పిలవడం మర్చిపోయామంటు నెమ్మదిగా సన్నాయి నొక్కులు నొక్కారు. దీనిపై ఎంపీపీ నాగబాబును సాక్షి వివరణ కోరగా అధికారుల తీరు ఇలా ఉందని మనస్తాపం వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై విచారించాలి



ప్రత్తిపాడులో సంతకాలు సేకరిస్తున్న పల్లంరాజు, నాయకులు

ప్రత్తిపాడు రూరల్: ఓటర్ల జాబితాలో నెలకొన్న అవకతవకలను పరిష్కరించాలని మాజీ కేంద్రమంత్రి ఎం.ఎం పళ్లంరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మవరంలో శనివారం సంతకాల సేకరణ చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. పళ్లంరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చేయడం దారుణమని, సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఫొటోతో స్పష్టమైన ఓటర్ జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదేపల్లి సత్యానందరావు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, ధర్నాలకోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచాలి

ప్రత్తిపాడు: ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్తిపాడులోని ఆ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా మెయిన్ రోడ్డు వెంబడి ప్రజల వద్దకు వెళ్లి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ సత్యనారాయణ, జిల్లా స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ తీరు అనుమానస్పదంగా ఉంది

జగ్గంపేట: మండల కేంద్రం జగ్గంపేటలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమానికి శనివారం మాజీ కేంద్ర రక్షణశాఖా మంత్రి పళ్లంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం నేడు ఎన్నికల కమిషన్ తీరుతో సంక్షోభంలో కూరుకుపోతోందని, ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కాకరాపల్లిలో బాణసంచా దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్సై, తహసీల్దార్

కోటనందూరు: బాణసంచా తయారీ, విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాకరాపల్లిలో బాణసంచా దుకాణాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యన్నారాయణతో కలిసి శనివారం తనిఖీలు చేపట్టారు. దుకాణం వద్ద ప్రమాదాలు జరగకుండా చేపట్టిన జాగ్రత్తలను పరిశీలించారు. ఎస్సై మాట్లాడుతూ బాణసంచా విక్రయించే వ్యాపారస్తులకు విధిగా ప్రభుత్వ అనుమతి ఉండాలన్నారు. విక్రయ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

గండేపల్లి: కొత్తగూడెం జిల్లా భద్రాద్రికి చెందిన ఎన్. రాజు (25) మండలంలోని రామేశంపేట సెంటర్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు లారీ డ్రైవర్లపై విచక్షణ రహితంగా దాడి చేశారు. నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14రోజులు రిమాండ్ విధించినట్లు గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపారు.

అరవై వసంతాల వేడుకలు

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సరెళ్ల జాకబ్‌జాన్ దేవుని పరిశుద్ధ మందిరం నిర్మించి అరవై వసంతాలు పూర్తయిన సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పరిశుద్ధ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ సరెళ్ల ఎలైజా ఆధ్వర్యంలో చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ నేత మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో జాకబ్‌జాన్ సతీమణి, ఎలైజా తల్లి నిరీక్షణమ్మకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి కేక్ కట్‌చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ ప్రసాద్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, సంఘస్తులు పాల్గొన్నారు.

ఆంధ్ర శబరిమలలో 1,008 కలశాల పూజ



కలశాలకు పూజలు చేస్తున్న శ్రీనివాసరావు దంపతులు

శంఖవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఆంధ్రా శబరిమలైలో 1,008 కలశాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు స్వామి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. ఆలయం వద్ద మహా కుంభాభిషేకం, చండీయాగం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు యాగశాలలను సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగాణం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమ్రోగింది. ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన భక్తులు భారీ ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి తెలిపారు.

వైభవంగా గౌరీదేవి ఉత్సవాలు



వెంకన్నబాబు నాటక ప్రదర్శనలో కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో 89వ గౌరీదేవి వార్షిక మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ గవిరమ్మ వేషాలను వచ్చే సంక్రాంతి వరకూ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామంలో స్థానిక కళాకారులు తొలిరోజైన శనివారం వెంకన్నబాబు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. కళలకు పుట్టినిల్లుగా భావించే ధర్మవరంలో గౌరీదేవి ఉత్సవాలను ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

క్రమశిక్షణకు మారుపేరు ఆర్ఎస్ఎస్

కిర్లంపూడి: మండలంలో గోనేడ గ్రామ శివాలయం ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు అల్లు శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తోట సర్వారాయుడు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. క్రమశిక్షణే ప్రధమ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ పనిచేయాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శరకణం రాజాబాబు, యడాలి రాంబాబు, గోకాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయుధ పూజ, భరతమాత, డాక్టర్జీ, గురూజీ చిత్రపటాలకు పూజలు చేశారు. ఆర్ఎస్ఎస్ సంఘ సేవకులు సంఘ్ ధ్వజానికి ప్రణామాలు, ప్రార్థన చేశారు. అనంతరం పూర్తి వేషధారణలో సంఘ సేవకులు కొద్దిసేపు వ్యాయామం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కర్రి ధర్మరాజు, సంఘ మండల ప్రముఖ్ జువ్విన తిరుపతిరావు, చిట్రా అప్పారావు, కందా వీరాస్వామి, కందుల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వీఏఏ సంఘ ఉపాధ్యక్షుడి ఎన్నిక



సాయి గణేష్

ప్రత్తిపాడు: జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఒమ్మంగి గ్రామ వీఏఏ కె.సాయి గణేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి వీఏఏ సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.వీ.రమణ ప్రకటించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సాయి గణేష్‌ను ప్రత్తిపాడు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి జోకా అమృత, వ్యవసాయ విస్తరణాధికారి బలరామ్, మండల వీఏఏల సంఘ ప్రతినిధులు ధనేకుల రఘు, ఎం. రామకృష్ణ, బి.అపర్ణ, జి.రామలక్ష్మి అభినందించారు.

అస్తవ్యస్తంగా మున్సిపాలిటీ



రహదారిపై పారుతున్న మురుగునీరు



పల్లపువీధిలో చెత్తతో పేరుకుపోయిన డ్రైనేజీ

ఏలేశ్వరం: పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైన్లల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు పోయే మార్గం లేక రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కోనేటిచెరువు గట్టుమీద వినాయకుడి ఆలయం ఎదురుగా ఉన్న డ్రైన్ల నుంచి మురుగునీరు పొంగి రహదారి మీదుగా పారడంతో దుర్గంధం వెదజల్లి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు పట్టణ వ్యాపంగా కుక్కలు, కోతుల సంచారంతో నానా అవస్థలు పడుతున్నామని మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.